Downloaded from http://smartprep.in

# ఆరు సూత్రాల పథకం, 1973 - ఆర్టికల్ 371 డి - రాష్ట్రపతి ఉత్తర్వులు

ఆంధ్ర తెలంగాణ ప్రాంతాల నాయకులతో సంప్రదించిన తర్వాత ఆనాటి ప్రధాని ఇందిరాగాంధీ ఆరుసూత్రాల పథకాన్ని 23 సెప్టెంబర్ 1973లో ప్రకటించింది. దీంతో అప్పటి వరకు అమల్లో ఉన్న ముల్కీ నిబంధనలు రద్దయి, దానిస్థానంలో ఆరుసూత్రాల పథకం రాష్ట్రపతి ఉత్తర్వులతో అమల్లోకి వచ్చాయి.

## ఆరు సూత్రాల పథకం:

1. రాష్ట్రంలోని వెనుకబడ్డ ప్రాంతాల సత్వర అభివృద్ధితో పాటు రాష్ట్ర రాజధానిని నిర్ణీత పద్ధతిలో అభివృద్ధిపర్చడానికి కచ్చితమైన నిధులను కేటాయించాలి. అటువంటి ప్రణాళికలను తయారుచేయడంలో వెనుకబడిన ప్రాంతానికి ప్రాతినిధ్యం వహించే ఎమ్మెల్యేతో పాటు కొందరు నిపుణులకు భాగస్వామ్యం కల్పిస్తూ ఒక రాష్ట్రస్థాయి ప్రణాళికా బోర్డును, వెనుకబడిన ప్రాంతాలకు సంబంధించిన ఉపసంఘాలను నియమించాలి.
2. విద్యా సంస్థల్లో స్థానిక అభ్యర్థులకు ప్రాధాన్యతనిచ్చే విషయంలో రాష్ట్రానికంతా ఒకే విధానాన్ని వర్తింపజేయాలి. రాష్ట్రంలో ముఖ్యంగా రాజధాని నగరంలో ఉన్నత విద్యావసతులు పెంచేందుకు ఒక కేం ద్రీయ విశ్వవిద్యాలయాన్ని స్థాపించాలి.
3. ఒక నిర్ణీత స్థాయి వరకు ప్రభుత్వ ఉద్యోగాల నియామకాల విషయంలో స్థానికులకే ప్రాధాన్యమివ్వాలి. ప్రమోషన్ల విషయంలో కూడా ఒక నిర్ణీత స్థాయి వరకు ఈ నిబంధన పాటించాలి.
4. ఉద్యోగ నియామకాలు, సీనియారిటీ, ప్రమోషన్ వంటి విషయాల్లో ఉత్పన్నమయ్యే ఫిర్యాదులను పరిశీలించేందుకు ఉన్నతాధికారాలు గల ఒక అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్ ఇచ్చే నిర్ణయాలను రాష్ట్ర ప్రభుత్వం విధిగా అమలుపర్చాలి.
5. పైన వివరించిన సూత్రాలను పాటించడంలో ఎదురయ్యే న్యాయపరమైన చిక్కులను అనిశ్చిత పరిస్థితులను నివారించేందుకు భారత రాజ్యాంగాన్ని తగువిధంగా సవరించే

Downloaded from http://smartprep.in

అధికారాన్ని రాష్ట్రపతికి కల్పించాలి.

6. పైన సూచించిన మార్గాన్ని అవలంబిస్తే ముల్కీ నిబంధనలు, తెలంగాణ ప్రాంతీయ కమిటీ కొనసాగింపు అనవసరమవుతాయి.

ఆరుసూత్రాల పథకం అమల్లోకి వచ్చిన తర్వాత ఈ పథకంలోని ఆరో సూత్రం ప్రకారం అప్పటి వరకు అమల్లో ఉన్న ముల్కీ నిబంధనలు, రీజనల్ కమిటీ రద్దయ్యాయి. ఈ పథకం అమలుతో స్థానికుడు కావడానికి కనీసంగా కావల్సిన నివాస అర్హత తగ్గింది. 1919 నుంచి అమల్లోకి వచ్చిన ముల్కీ నిబంధనల ప్రకారం స్థానిక అభ్యర్థి అంటే కనీస నివాసం పదిహేను సంవత్సరాలుగా ఉంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పాటుతో 1956లో పన్నెండు సంవత్సరాలకు కుదించారు. 18-10-75 నుంచి జారీ అయిన రాష్ట్రపతి ఉత్తర్వుల అమలుతో పన్నెండు సంవత్సరాలుగా ఉన్న కనీస నివాస అర్హత నాలుగు సంవత్సరాలకు కుదించబడింది. ఈ నివాసాన్ని సైతం ఆయా సంబంధిత జోన్లకు పరిమితం చేశారు.

## ఆర్టికల్ 371 డి

ఈ ఆరుసూత్రాల పథకానికి రాజ్యాంగ రక్షణ కోసం 32వ రాజ్యాంగ సవరణతో ఆర్టికల్ 371 డి ని రాజ్యాంగంలో పొందుపర్చి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని ప్రభుత్వ ఉద్యోగరంగం, విద్యారంగంలో సమన్యాయం చేసేందుకు నిర్ణయించారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 371 డి కి అనుగుణంగా 18-10-1975లో కేంద్ర ప్రభుత్వం జీవో.నెం.674 ద్వారా రాష్ట్రపతి ఉత్తర్వులను జారీచేసింది. దీని ప్రకారం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని ఉద్యోగ నియామకాల కోసం ఆరు జోన్లుగా విభజించారు. జోన్లు 1, 2,3 ఆంధ్రప్రాంతానికి సంబంధించినవి కాగా జోన్ 4 రాయలసీమది, జోన్ 5, 6 తెలంగాణవిగా ఇందులో పేర్కొన్నారు. ఈ రాష్ట్రపతి ఉత్తర్వుల ప్రకారం ఏ జోను వారు ఆ జోనుకే స్థానిక అభ్యర్థులు, మిగతా జోన్లకు స్థానికేతరులన్నమాట. స్థానిక అభ్యర్థి అంటే కనీస నివాస అర్హత నాలుగు సంవత్సరాలుగా ఇందులో పేర్కొన్నారు.

SmartPrep.in

Downloaded from http://smartprep.in

రాష్ట్రపతి ఉత్తర్వుల్లోని పేరా 14లో పొందుపర్చిన ఆఫీస్‌లన్నింటికీ స్థానిక రిజర్వేషన్ నుంచి మినహాయింపు ఇచ్చినప్పటికీ రాష్ట్రపతి ఉత్తర్వులకు అనుగుణంగా తేదీ.11-1-1975న జారీ చేసిన జీవో. నెం. 728 లోని పేరా రెండు ప్రకారం మినహాయింపు పొందిన రాష్ట్ర సచివాలయం, శాఖాధిపతుల కార్యాలయాలు, రాష్ట్రస్థాయి కార్యాలయాల్లోని ఉద్యోగ నియామకాలు, బదిలీల్లో అన్ని ప్రాంతాలకు సమన్యాయం చేసేందుకు ఈక్విటబుల్ షేర్ (Equitable Share) లేదా సమన్యాయ సూత్రాన్ని పాటించాలని ఉత్తర్వులు ఇచ్చారు.

రాష్ట్రపతి ఉత్తర్వులకు అనుగుణంగా జారీ అయిన మరో జీవో. నెం.729 పేరా 21లో రాష్ట్ర సచివాలయం, శాఖాధిపతుల కార్యాలయాలు, రాష్ట్రస్థాయి ఆఫీసుల్లో జరిగే ఉద్యోగ నియామకాల్లో ఫేర్ షేర్ (Fair Share) సూత్రాన్ని పాటించి అన్ని ప్రాంతాల నుంచి సమ పద్ధతుల్లో నియామకాలు జరగాలి అని పేర్కొన్నది.

## రాష్ట్రపతి ఉత్తర్వులు

రాష్ట్రపతి ఉత్తర్వుల ప్రకారం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఉద్యోగ నియామకాలను ఈ విధంగా చేపట్టాల్సి ఉంది.

1. జిల్లా స్థాయి కేడర్లలో ఎల్.డి.సి. లేదా ఎల్.డి.సి.తో సమానమైన ఉద్యోగాలు, ఎల్.డి.సి. కింది స్థాయి ఉద్యోగాల్లో 80 శాతం ఉద్యోగాలను ఆ జిల్లా వాళ్లకే రిజర్వు చేయాలి.
2. జోనల్ స్థాయి నాన్ గెజిటెడ్ పోస్టుల్లో ఎల్.డి.సి. కంటే పై స్థాయి నాన్ గెజిటెడ్ ఉద్యోగాల్లో 70 శాతం రిజర్వేషన్ ఆ సంబంధిత జోనువాళ్లకు కల్పించాలి.
3. జోనల్ స్థాయి గెజిటెడ్ పోస్టుల్లో 60 శాతం రిజర్వేషన్‌ను ఆ జోనులోని అభ్యర్థులకే కల్పించాలని పేర్కొంటున్నాయి.

స్థానిక అభ్యర్థులకు రిజర్వు చేసిన ఉద్యోగాలు పోగా అంటే జిల్లా స్థాయి పోస్టుల్లో స్థానిక జిల్లావాళ్లకు రిజర్వు చేసిన 80 శాతం పోగా మిగతా 20 శాతం ఉద్యోగాల్లో, జోనల్ నాన్ గెజిటెడ్ ఉద్యోగాల్లో ఆ జోనువాళ్లకు రిజర్వు చేసిన 70 శాతం ఉద్యోగాలు పోగా మిగతా 30

SmartPrep.in

Downloaded from http://smartprep.in

శాతం ఉద్యోగాలను అదే విధంగా జోనల్ గెజిటెడ్ పోస్టుల్లో ఆ జోనువాళ్లకు రిజర్వు చేసిన 60 శాతం ఉద్యోగాలు పోగా మిగతా 40 శాతం ఉద్యోగాలన్నింటినీ ఓపెన్ కాంపిటీషన్ ద్వారా భర్తీ చేయాలి.

రాష్ట్రపతి ఉత్తర్వుల్లో స్థానికులకు రిజర్వేషన్ ఉంది. కానీ స్థానికేతరులకు రిజర్వేషన్ లేదు. స్థానికేతర కోటాగా భావింపబడుతున్నది ఓపెన్ కోటా. దానికి పోటీపడేందుకు స్థానికులు, స్థానికేతరులు ఇద్దరూ అర్హులే. ప్రతిభ ఆధారంగా ఆ కోటా భర్తీ చేయాలి. ఎవరు ప్రతిభావంతులైతే వారికే పట్టం గట్టాలి.

రాష్ట్రపతి ఉత్తర్వులోని పేరా 5 ప్రకారం జిల్లా స్థాయి ఉద్యోగాల్లో జిల్లాను జోనల్ స్థాయి ఉద్యోగాల్లో జోన్‌ను యూనిట్‌గా తీసుకుని నియామకాలు గాని పదోన్నతులు గాని లేదా ఉద్యోగుల బదిలీలుగాని జరగాలి. ఎట్టి పరిస్థితుల్లో జిల్లాస్థాయి ఉద్యోగాల్లో ఒక జిల్లా నుంచి ఇంకొక జిల్లాకు, జోనల్ స్థాయి ఉద్యోగాల్లో ఒక జోన్ నుంచి ఇంకొక జోన్‌కు బదిలీలు చేయకూడదు అనే నిబంధనలున్నా వాటిని ఉల్లంఘించి నియామకాలు పదోన్నతలు బదిలీలు చేయడంతో పెక్కుమంది తెలంగాణ ఉద్యోగులు న్యాయం కోసం కోర్టులను ఆశ్రయించిన ఉదంతాలు చాలా ఉన్నాయి.

## రాష్ట్రపతి ఉత్తర్వుల ప్రకారం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని జోన్లు – జిల్లాలు

**జోన్ 1:** శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం

**జోన్ 2:** తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, కృష్ణా

**జోన్ 3:** గుంటూరు, ప్రకాశం, నెల్లూరు

**జోన్ 4:** అనంతపూర్, చిత్తూరు, కడప, కర్నూలు

**జోన్ 5:** ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మం

Downloaded from http://smartprep.in

**జోన్ 6:** హైదరాబాద్, రంగారెడ్డి, నిజామాబాద్, మహబూబ్‌నగర్, మెదక్, నల్లగొండ.

**రాష్ట్రపతి ఉత్తర్వుల నుంచి మినహాయింపు ఇస్తూ కొన్ని కార్యాలయాలను 14వ నిబంధనలో పేర్కొన్నారు. అవి:**

14 ఎ. సచివాలయం

14 బి. శాఖాధిపతుల కార్యాలయాలు

14 సి. రాష్ట్రస్థాయి కార్యాలయాలు

14 డి. స్పెషల్ ఆఫీసులు లేదా ఎస్టాబ్లిష్‌మెంట్లు

14 ఇ. మేజర్ డెవలప్‌మెంటు ప్రాజెక్టులు

14 ఎఫ్. హైదరాబాద్ సిటీ పోలీస్.

SmartPrep.in

SmartPrep.in